సాక్షి
పార్వతీపురం మన్యం
శుక్రవారం । 29 । నవంబర్ । 2024



**క్రీడాస్ఫూర్తితో మెరుగైన సేవలందించాలి**

జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మూడురోజుల పాటు సాగే వార్షిక జిల్లా పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్-2024ను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి గురువారం ప్రారంభించారు. - 8లో...



**మెప్మా పీడీగా చిట్టిరాజు**

విజయనగరం అర్బన్: మెప్మా పీడీగా జి.వి.చిట్టిరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ అంబేడ్కర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

**సివిల్ జడ్జిగా నైమిష**



చీపురుపల్లి: సివిల్ జడ్జి పోస్టులకు నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలు ఈ నెల 27న విడుదలయ్యాయి. ఇందులో చీపురుపల్లి పట్టణానికి చెందిన కెంబూరు నైమిష ప్రతిభ చూపారు. సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. కెంబూరు భరత్‌మోహన్, రుక్మిణి దంపతుల రెండో కుమార్తె నైమిష ఏయూలో న్యాయవిద్య అభ్యసించారు. సివిల్ జడ్జి పోస్టుకు ఆమె ఎంపిక కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## న్యూస్‌రీల్

### ఈవీఎం గొడౌన్లను తనిఖీ చేసిన కలెక్టర్




ఈవీఎం గొడౌన్లను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణ పరిధిలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న ఈవీఎం గొడౌన్లను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా ఆయన గొడౌన్లను సందర్శించి పరిస్థితులను గమనించారు. ఈ సందర్భంగా భద్రతా సిబ్బంది, అధికారులకు కలెక్టర్ పలు సూచనలు, మార్గదర్శకాలు జారీచేశారు. భద్రతా ప్రమాణాలు పాటించాలని, పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యటనలో ఆయన వెంట ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

### లక్ష్యాన్ని ఛేదించిన లక్ష హిత

- జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన గిరిజన విద్యార్థిని



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన లక్షహిత

సీతంపేట: జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు సీతంపేట బాలికల గురుకుల పాఠశాలకు చెందిన హెచ్.లక్షహిత ఎంపికైనట్లు ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్ తెలిపారు. జాతీయ గౌరవదివస్ కార్యక్రమంలో భాగంగా ఇటీవల టీసీఆర్ అండ్ టీఎం ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన లక్షహిత జాతీయస్థాయికి ఎంపికైంది. ఈనెల 29వ తేదీన కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుంది. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి, ఏపీఓ చిన్నబాబులు ఆమెను గురువారం అభినందించారు.

### 108లో ప్రసవం



పుట్టిన శిశువును బంధువులకు అందజేస్తున్న 108 సిబ్బంది

వీరఘట్టం: మండలంలోని ఎం.వి.పురం గ్రామానికి చెందిన పర్సుబోతు సన్యాసమ్మ రెండవ కాన్పులో 108 వాహనంలో ప్రసవించి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. గురువారం ఆమెకు పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. వెంటనే వీరఘట్టానికి చెందిన 108 వాహనం ఎంవిపురం గ్రామానికి వెళ్లి సన్యాసమ్మను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆమెకు నొప్పులు ఎక్కువ కావడంతో పైలెట్ చంద్రం వాహనాన్ని పక్కకు ఆపగా ఈఎంటీ శ్రీనివాసరావు ఆమె పరిస్థితిని డాక్టర్ ఆషిక్‌కు తెలయజేశాడు. డాక్టర్ సూచనల ప్రకారం ఈఎంటీ శ్రీనివాసరావు సన్యాసమ్మకు పురుడు పోయగా పండంటి ఆడబిడ్డ జన్మించింది. వారి కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు తల్లీబిడ్డలను మెరుగైన వైద్య చికిత్సల కోసం రాజాం కేర్ ఆస్పత్రికి 108 సిబ్బంది తరలించారు. ఎంతో చాకచక్యంగా సన్యాసమ్మకు పురుడు పోసిన 108 సిబ్బందిని కుటుంబ సభ్యులు అభినందించారు.

### వచ్చేనెల 3న సికిల్‌సెల్ పరీక్షలు

సీతంపేట: పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా వచ్చేనెల 3 వ తేదీన సికిల్ సెల్ ఎనిమియా హెచ్‌పీఎల్‌సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి నుంచి మార్చి వరకు సికిల్ సెల్ ఎనిమియా పరీక్షలు ఇదివరకే చేశామని, వారందరికీ స్థానిక వైటీసీలో డిసెంబర్ 3న కేజీహెచ్ వైద్యులతో ప్రత్యేక రక్త పరీక్షలు చేయనున్నామని స్పష్టం చేశారు.

# గురువులకు గుదిబండ



- బోధనేతర పనులతో ప్రాణ సంకటం
- యాప్‌ల అప్‌లోడ్ నుంచి మెగా పేరెంట్ టీచర్ సమావేశం వరకు ఒత్తిడికి గురువుతున్న ఉపాధ్యాయులు
- 299 మంది హెచ్‌ఎంలకు, 1,600 ప్రైమరీ టీచర్లకు రెసిడెన్షియల్ ట్రైనింగ్
- శిక్షణ తరగతులకు నిషిద్ధ సెలవుల నిబంధన
- తాజాగా శిక్షణ తరగతుల్లో గుండెపోటుతో హెచ్‌ఎం మృతి
- ఆందోళనకు దిగిన ఉపాధ్యాయలోకం

పార్వతీపురంటౌన్/పాలకొండ/భామిని/విజయనగరం అర్బన్/గజపతినగరం:

విద్యారంగంలో బోధన కీలకమైనది. తరగతి గదిలో ఉపాధ్యాయుడు ప్రశాంతంగా పాఠ్యాంశ బోధన చేసినప్పుడే విద్యాలక్ష్యాలు నెరవేరుతాయి. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంపొందుతాయి. పాఠ్యాంశాలపై పట్టు సాధించగలరు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రభుత్వం బోధనేతర పనులను అప్పగించి బోధనకు దూరం చేస్తోందంటూ ఉపాధ్యాయలోకం ఆందోళన వ్యక్తంచేస్తోంది. పాఠశాలల నిర్వహణపై పదుల సంఖ్యలోని యాప్‌లలో వివిధ సమాచారాన్ని అప్‌లోడ్ చేయడం నుంచి మెగా పేరెంట్ టీచర్ సమావేశం పేరుతో 50 పేజీల కార్యాచరణ ప్రణాళిక తయారీ వరకు ఊపిరిసలపని బోధనేతర పనులను అప్పగించడంపై మండిపడుతోంది. సరిగా పనిచేయని గురువులకు మెమోలు తప్పవన్న హెచ్చరికలతో ఒత్తిడి అధికమవుతోందంటూ ఆందోళన వ్యక్తంచేస్తోంది. అదే ఒత్తిడితో గజపతినగరంలోని మరుపల్లిలో ప్రధానోపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ తరగతులకు గురువారం హాజరైన భామిని మండలం నేరడి ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం ఎస్.శ్రీనివాసరావు గుండెపోటుతో మృతి చెందాడని ఆరోపించింది. ఈ ఘటనపై శిక్షణ కేంద్రం వద్దే ఆందోళనకు దిగింది.



పార్వతీపురం మన్యం జిల్లాలోని డీఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

**ప్రభుత్వమే భాధ్యత వహించాలి**

గజపతినగరంలోని మరుపల్లిలో ఎస్ఎల్‌డీపీ శిక్షణకు హాజరైన ఉపాధ్యాయుడి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు అన్నారు. పార్వతీపురం డీఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ గణపతిరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో శిక్షణకు హాజరైన ఓ ఉపాధ్యాయుడు మృతిచెందిన సందర్భంలో రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ రద్దుచేస్తామని చెప్పిన టీడీపీ కూటమి ప్రభుత్వం.. ఉపాధ్యాయులను వేధించడమే లక్ష్యంగా మళ్లీ శిక్షణ తరగతులు కొనసాగిస్తోందన్నారు. మృతుని కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్య తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలమురళీకృష్ణ, కాగాన విజయ్, భాస్కరరావు, గోవింద్, పీసీహెచ్ శ్రీనివాసరావు, సురేష్, మురళీ, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విజయనగరం డీఈఓ కార్యాలయం వద్ద కూడా ఉపాధ్యాయులు ఆందోళన చేశారు.

**శిక్షణ ఇలా..**

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించాలనే ఉద్దేశంతో తొలుత ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 299 మంది ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధాపాధ్యాయులకు స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎస్ఎల్‌డీపీ) పేరుతో రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని గజపతినగరం మండలంలోని మరుపల్లిలో గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్నారు. శిక్షణకు హాజరైనవారిలో 54 సంవత్సరాల పైబడిన ప్రధానోపాధ్యాయులే అధిక మంది ఉన్నారు. అప్పటికే పాఠశాల నిర్వహణ బాధ్యతల ఒత్తిడితో ఉన్న ప్రధానోపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణ మరింత ఒత్తిడిని పెంచినట్టు ఆరోపణ. అలాగే, 1, 2 తరగతులకు బోధిస్తున్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయలకు డెంకాడ మండలం మోదవలసలో ఎఫ్ఎల్ఎన్ పేరుతో రెసిడెన్షియల్ శిక్షణ తరగతులు సాగుతున్నాయి. హెచ్‌ఎం మృతితో శిక్షణను రద్దు చేశారు.

**ఉపాధ్యాయులు చెబుతున్న ఒత్తిడి పెంచే పనులివే...**

- ఇన్‌ఫర్మేషన్ అప్‌లోడ్ అర్జెంట్ అంటూ యాప్‌ల ద్వారా చేయించే పనులు మానసి ఒత్తిడితో పాటు పాఠాలు బోధించకుండా ఇబ్బంది పెడుతున్నాయి.
- అకడమిక్ ప్రోగ్రాం కాకుండా వేరే ప్రోగ్రామ్స్ పేరుతో విద్యార్థులు, ఉపాధ్యాయుల సమయాన్ని హరించడం.
- మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యాచరణ ప్రక్రియ పేరుతో నెల రోజుల ముందు నుంచి పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయుల అకడమిక్ సమయాన్ని వృథా చేయించడం.
- విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యాచరణ ప్రక్రియ కోసం దాదాపు 50 పేజీల నివేదికను తయారుచేయమనడం.
- పరీక్షల్లో విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదుకు తగినంత సమయం ఇవ్వకపోడం.
- బయోమెట్రిక్ హాజరు వేయడానికి కనీసం 10 నిమిషాలు గ్రేస్ పీరియడ్ ఇవ్వకపోవడం.
- ఉపాధ్యాయుల కుటుంబ జీవనానికి సంబంధించిన పీఎఫ్, ఏపీటీఎల్ఐ లోన్స్ విడుదల వంటి ఆర్థిక పరమైన అంశాలను సకాలంలో పరిష్కరించకపోవడం.

**ఉపాధ్యాయుడి మృతిపై ఆరా**



మృతి చెందిన ప్రధానోపాధ్యాయుడు ఎస్.శ్రీనివాసరావు

గజపతినగరం: గజపతినగరం మండలంలోని మరుపల్లి వద్ద ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎస్ఎల్‌డీపీ శిక్షణకు హాజరైన హెచ్‌ఎం మృతిపై విశాఖపట్నం జోన్-1 ఆర్‌జేడీ బి.విజయభాస్కర్ ఆరా తీశారు. ఎంఈఓలతో కలిసి శిక్షణ కేంద్రాన్ని గురువారం సందర్శించారు. కోర్సు డైరెక్టర్, ఎంఈఓ-2 సాయిచక్రధర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 150 కిలోమీటర్ల పైబడి దూరం నుంచి వస్తున్న 52 మంది హెచ్‌ఎంలు స్థానికంగానే ఉంటున్నట్టు ఆయన తెలిపారు. మృతుడు సిరిపురపు శ్రీనివాసరావు ఉదయం ఏడున్నర గంటలకు అస్వస్థతకు గురికావడంతో వెంటనే గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించామని, అప్పగికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారన్నారు. మృతదేహాన్ని ఆయన స్వస్థలం పాలకొండలోని సీతంపేట రోడ్డుకు తరలించినట్టు చెప్పారు.

**శిక్షణ రద్దు**

ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు ఎఫ్ఎల్ఎన్, ఎస్ఎల్‌డీపీ శిక్షణలు పూర్తిగా నాన్‌రెసిడెన్షియల్ పద్ధతిలోనే జరుగుతాయని, సాయింత్రం 5 గంటల వరకే తరగతులు నిర్వహిస్తామని ఆర్‌జేడీ తెలిపారు. ప్రస్తుతం మరుపల్లిలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను రద్దుచేస్తున్నట్టు ప్రకటించారు.

**పాలకొండ, నేరడిలో విషాదం**

హెచ్‌ఎం శ్రీనివాసరావు మృతితో పాలకొండ పట్టణంలోని ఎన్.కె.రాజపురంలో విషాదం అలముకుంది. భామిని మండలం నేరడి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ గజపతినగరంలో జరిగిన ఎస్ఎల్‌డీపీ శిక్షణకు హాజరై గుండెపోటుతో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. మృతిని భార్య దుప్పాడ సూడామణి నగరపంచాయతీ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. శ్రీనివాసరావు మృతదేహాన్ని పాలకొండలోని అతని స్వగృహానికి చేర్చారు. శుక్రవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ గురువారం సాయంత్రం శ్రీనివాసరావు భౌతికకాయానికి నివాళులర్పించారు. శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాల విద్యాశాఖ అధికారులు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. పాఠశాల హెచ్‌ఎం మృతితో నేరడిలో విషాదం అలముకుంది. గ్రామస్తులు, టీచర్లు సంతాపం తెలిపారు.



శ్రీనివాసరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ



భామిని: నేరడి ఎంపీయూపీ స్కూల్ వద్ద విషాదంలో గ్రామస్తులు

**నిర్బంధ శిక్షణ వద్దు**



అత్యాధునిక సాంకేతిక యుగంలో కూడా వారం రోజులపాటు కుటుంబాలకు దూరంగా ఉంచి రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వడం మానసిక ఆందోళనకు గురిచేస్తోంది. అనారోగ్య కారణాలకు కూడా సెలవు ఇవ్వకుండా శిక్షణకు హాజరు కావాలని నిర్బంధం చేయడం సరికాదు. ఇప్పటికే బోధనేతర పని భారం పెంచి అనేక యాప్‌ల నిర్వహణ, రకరకాల పనులతో ఒత్తిడికి గురవుతున్నాం. స్కూల్ లీడర్ షిప్ ట్రెనింగ్, ఫౌండేషన్ అంశాలలో రెసిడెన్షియల్ పద్ధతిలో కాకుండా శిక్షణ ఇవ్వాలి.

– ఇజ్జిరోతు రామినాయుడు, రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం

**బోధనేతర పనులతో మానసిక ఒత్తిడి**



బోధనేతర పనుల వల్ల విద్యార్థులకు ఉపాధ్యాయులు సరిగా పాఠ్యాంశ బోధన చేయలేకపోతున్నారు. మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. దీనికి రెసిడెన్షియల్ శిక్షణ తరగతులు తోడయ్యాయి. ఉపాధ్యాయ వర్గం భయాందోళనలోపడింది. ఏడాదిలో కనీసం 100 రోజుల వరకు పాఠశాలల్లో వివిధ రకాల దినోత్సవాలు నిర్వహించాల్సి వస్తోంది. వీటిలో జాతీయ స్థాయిలోని ప్రాధాన్యత కలిగినవి దినోత్సవాలు మాత్రమే నిర్వహిస్తే కొంత మేరకు పని ఒత్తిడి తగ్గుతుంది. ఒత్తిడికి గురిచేసేలా శిక్షణ తరగతులు నిర్వహించవద్దు.

– డి.శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి, పీఆర్‌టీయూ



ఉపాధ్యాయుడి మృతిపై డీఈఓ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల నిరసన

**ఒత్తిడితోనే ఉపాధ్యాయుడి మృతి**



ఉపాధ్యాయుడి మరణానికి మానసిక ఒత్తిడే కారణం. బోధనేతర పనుల ఒత్తిళ్లతో ఉన్న ఉపాధ్యాయులకు రెసిడెన్సియల్ శిక్షణ తరగతులు మరణ శాసనాలుగా మారాయి. రాష్ట్రంలో మరో సంఘటనకు అవకాశం ఇవ్వకుండా ప్రభుత్వం శిక్షణ తరగతులు రద్దుచేయాలి.

– కె.శ్యామ్, రాష్ట్ర కార్యదర్శి, ఎస్టీయూ

## పూలే ఆశయసాధన కోసం పనిచేయాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



పూలే చిత్రంపటంవద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు. బడుగు, బలహీన, అణగారిన వర్గాల కోసం, మహిళల విద్య, అభ్యున్నతి కోసం కృషి చేసిన మహానుభావుడని పేర్కొన్నారు. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో స్త్రీ జనోద్ధరణ కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి పూలే అన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని అధికారులకు పిలుపునిచ్చారు. అనంతరం డీఐపీఆర్‌ఓ ఎల్.రమేష్, కలెక్టరేట్ సిబ్బంది ఆయన చిత్రపటం వద్ద పూలను వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ, కలెక్టరేట్‌లోని అన్ని విభాగాల పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మారిషస్ ఫైనాపిల్‌తో అధిక ఆదాయం



మారిషస్ వెరైటీని పరిశీలిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

- ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: మారిషస్ ఫైనాపిల్ పంట అధికదిగుబడి ఇస్తుందని తద్వారా గిరిజనుల ఆదాయం మెరుగుపడుతుందని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలో గతంలో ఇచ్చిన మారిషస్ రకాన్ని గురువారం ఆయన పరిశీలించారు. పులిపుట్టి పంచాయతీ పరిధిలోని ఇప్పగూడ గ్రామంలో మొక్కల ఎదుగుదల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఐటీడీఏ ద్వారా 358 మంది రైతులకు 73 ఎకరాలకు గాను 5,89,510 మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌వో ఎస్‌వీ గణేష్, హెచ్‌వో జయశ్రీ, రైతులు ఎస్.తోటముఖలింగం, కుమార్, దశమయ్య, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఇచ్చిన హామీ అమలు చేయాలి

- అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను సీఆర్టీలుగా మార్చాలి
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: గిరిజన గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల స్థానాలకు మెగా డీఎస్సీ నుంచి మినహాయింపు ఇస్తామని, వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తామని సెక్రటేరియెట్ ఎదురుగా సదరు ఉపాధ్యాయులకు గిరిజన సంక్షేమశాఖామంత్రి, స్త్రీశిశు సంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఇచ్చిన హామీని అమలుచేయాలని మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర కోరారు. ఈ మేరకు గురువారం సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ, డీఎస్సీలో తమ ఉద్యోగాలను కలపడంతో దశాబ్దాలుగా పనిచేస్తున్న గిరిజన గురుకుల విద్యాలయాల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు తమ జీవితం రోడ్డుపాలైందని వాపోతూ నిరసనలకు దిగారని పేర్కొన్నారు. గిరిజన గురుకులాల్లో ఉపాధ్యాయులను అవుట్‌సోర్సింగ్ విధానంలో నియామకానికి 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వంలోనే శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వారికి జీతాలు పెంపుదల చేయడంతో పాటు సీఆర్టీలుగా చేసేందుకు తానే ఫైల్ పెట్టానని చెప్పారు. అయితే అవుట్‌సోర్సింగ్ విధానంలో ఈ శాఖలో తప్ప మరే శాఖలో ఉపాధ్యాయుల నియామకం చేయకపోవడం, దీనిపై సరైన జీఓలను గతంలో టీడీపీ ప్రభుత్వం జారీ చేయకపోవడంతో పలు మార్లు ఈ ఫైలు ఆర్థిక శాఖ వద్ద వెనుదిరిగిందని చెప్పారు. నాటి డీఎస్సీలో వారి ఉద్యోగాలను మినహాయిస్తూ నోటిఫికేషన్ జారీ చేశామని వివరించారు.

**గిరిజన విద్యార్థుల మరణాలు బాధాకరం**

రాష్ట్రంలో, జిల్లాలో వరుసగా గిరిజన విద్యార్థుల మరణాలు సంభవిస్తుండడం బాధాకరమని రాజన్నదొర ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఎక్కడైనా విద్యార్థులు మరణిస్తే అవి ప్రభుత్వ హత్యలంటూ విమర్శలు నాడు చేసిన నేటి గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రస్తుత ఈ మరణాలపై ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఉన్నారు.

## డీఈఓవోలపై వేటు..!

- రెండు నెలల ఉద్యోగాన్నీ వదిలేలా లేరు!
- ఎమ్మెల్యేల సిఫారసులున్న కొత్తవారికే అవకాశం

సాక్షి, పార్వతీపురం మన్యం: చిరుద్యోగులపై కూటమి నేతల అక్కసు కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే వీవోఏలు, పాఠశాలల్లో స్వీపర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, కేజీబీవీల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టులో పని చేస్తున్న ఐసీఆర్‌పీలు..ఇలా ఏ ఒక్కరినీ వదలకుండా తొలగిస్తున్న విషయం విదితమే. ఇప్పుడు పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ఖరీఫ్ సీజన్‌లో నడిచే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పని చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ల(డీఈవో)నూ వదలడం లేదు. వాస్తవానికి ఈ పోస్టు ఏటా ఖరీఫ్ ధాన్యం సేకరణ ఉండే రెండు నెలలు మాత్రమే ఉంటుంది. వాటినీ కూటమి నేతలు వదలకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. జిల్లాలో ప్రస్తుత సీజన్‌కు సంబంధించి 183 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న విషయం విదితమే. కొనుగోలు వివరాలను ఆన్‌లైన్ చేసేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను తాత్కాలిక ప్రాతిపదికన పౌరసరఫరాల సంస్థ ద్వారా నియమిస్తుంటారు. సాధారణంగా గతంలో పని చేసిన వారినే మళ్లీ కొనసాగిస్తుంటారు. ఈ ఏడాది కూడా అదే మాదిరి నియామకాలు పూర్తయ్యాయి. అందరూ విధుల్లోకి చేరేందుకు సిద్ధమవుతున్న సమయంలో..గత ప్రభుత్వ హయాంలో పని చేశారన్న కారణంతో మూడు, నాలుగు రోజులుగా కొంత మందిని తొలగిస్తుండడం చర్చనీయాంశమైంది. పార్వతీపురం మండలంలోని డోకిశీల డీఈవోగా దాదాపు మూడేళ్ల నుంచి ఎ.శాంతకుమార్ పని చేస్తున్నాడు. ప్రస్తుత సీజన్‌కూ తొలుత ఆయననే రెండు నెలల కాలానికి నియమిస్తూ పత్రం కూడా ఇచ్చారు. ఐదు రోజుల క్రితం ఆయనను తొలగించి..మరో వ్యక్తిని నియమించారు. జిల్లాలో చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉంది. ప్రస్తుతం ఉన్న వారిని తొలగించి, కూటమి ఎమ్మెల్యేల సిఫారసు లేఖలతో కొత్త వారిని నియమిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వారికి విధులపై అవగాహన లేకున్నా..తీసుకోవడం గమనార్హం. వారి నియామకాలను రైతు నేస్తం అనే ఏజెన్సీ ద్వారా చేపడతారు. మొన్నటి వరకు తామే కొనసాగుతామని చెప్పి..విధులు కూడా అప్పగించి, ఇప్పుడు తొలగించడమేమిటని బాధితులు వాపోతున్నారు. ఇదే విషయమై ఏజెన్సీ ప్రతినిధులను ప్రశ్నిస్తే.. తామేమీ చేయలేమన్నట్లు చేతులెత్తేస్తున్నారు.

## క్లుప్తంగా

### ఇద్దరు అయ్యప్ప భక్తులకు తీవ్రగాయాలు

● బైక్‌ను కారు ఢీకొనడంతో ప్రమాదం


చికిత్స పొందుతున్న మహేష్


వైద్య పరీక్షల కోసం చైతన్యను వీల్‌చైర్‌పై తీసుకెళుతున్న ఆస్పత్రి సిబ్బంది

రామభద్రపురం: మండలంలోని కొండకెంగువ గ్రామానికి చెందిన ఇద్దరు అయ్యప్ప మాలాధారణ ధరించిన భక్తులు తుని వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అంపావిల్లి మహేష్, బండారు చైతన్య బుధవారం ద్విచక్ర వాహనంపై ద్వారపూడిలో అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లారు.రాత్రి 9.30 గంటల సమయంలో తుని వద్ద ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో మహేష్‌కు తలపైన బలమైన గాయం కాగా చైతన్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ప్రథమ చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు వారిని తరలించారు. మహేష్ ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు.ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆందోళన చెందుతూ హుటాహుటిన విశాఖ కేజీహెచ్‌కు బయలుదేరి వెళ్లారు.

### అంగన్వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ


పౌష్టికాహార రికార్డులను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ జిల్లా పీడీ ఎంఎన్ రాణి

సీతానగరం: జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల ద్వారా సమకూర్చుతున్న పౌష్టికాహారాన్ని నిర్దేశించిన గడువులోగా బాలింతలు, గర్భిణులు, ప్రీస్కూల్ పిల్లలకు పంపిణీ చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎన్ రాణి అన్నారు. ఈ మేరకు సీతానగరం మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎన్ రాణి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో విద్యార్థుల హాజరు, కేంద్రానికి సంబంధించిన రికార్డులను నిశితంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న విద్యాబోధనను చూశారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా పౌష్టికాహారం అందుతున్నదీ లేనిది ఆరాతీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలకేంద్రాన్ని మోడల్ కేంద్రంగా గుర్తించడం వల్ల మిగిలిన కేంద్రాలూ ఇదే తరహాలో తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఐసీడీఎస్‌కు ప్రాధాన్యం కల్పిస్తుందని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలమేరకు కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఆమెవెంట జిల్లా నోడల్ అధికారి ఎస్.రాజ్యలక్ష్మి ఉన్నారు.

### బాల బాలికలకు సైక్లింగ్ క్రీడా ఎంపికలు

● గుంటూరులో కార్యక్రమం నిర్వహణ

పార్వతీపురంటౌన్: ఈనెల30, డిసెంబర్ 1న బాలబాలికలకు రాష్ట్రస్థాయి సైక్లింగ్ క్రీడా ఎంపికలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీఓ ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుంటూరు జిల్లాలోని గుడ్ రోల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద అంతర్ జిల్లాల బాల బాలికలకు సైక్లింగ్ క్రీడా ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలలో ఎంపికైన బాలబాలికలు డిసెంబర్ 6 నుంచి 10 వ తేదీ వరకు ఒడిశాలోని పూరీలో జరగనున్న 29వ జాతీయ స్థాయి బాల బాలికల సైక్లింగ్ క్రీడాపోటీలకు పంపుతామని పేర్కొన్నారు. జిల్లాలో గల ఆసక్తి గల సైక్లింగ్ క్రీడాకారులు తమ తమ సైక్లింగ్ ఎక్విప్‌మెంట్‌తో ఈనెల 30న ఉదయం 8 గంటలకు గుడ్ రోల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, మందడాం గ్రామం, తుళ్లూరు మండలం గుంటూరు జిల్లాలో రాష్ట్రస్థాయి ఎంపికలకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. పూర్తి వివరాలకు వి.కనకా రావు, సైక్లింగ్ శిక్షకుడు, ఫోన్ 9849379932, ఎస్.శివా రెడ్డి, అథ్లెటిక్స్ శిక్షకుడు ఫోన్ 9703092077 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹127 | ₹227 | ₹234 |






# సమ్మెలో గురువులు..
# సాగని చదువులు

పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి.. భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురువులే... తమ బతుకు కోసం పోరుబాట పట్టారు. గిరి పుత్రులను చదువుతోపాటు.. ఆట, పాటల్లో మెరికల్లా సానబెడుతున్న ఉపాధ్యాయులు... నేడు చాలీచాలని వేతనాలతో కుటుంబాన్ని నెట్టుకురాలేక, తమ బిడ్డల భవిష్యత్తును తలుచుకుంటూ కుంగిపోతున్నారు. ఏళ్లుగా నమ్ముకుని ఉన్న ఉద్యోగం సందిగ్ధంలో పడటంతో విధి లేక, మరో దారి కానరాక పది రోజులుగా, అవిశ్రామంగా పోరాటం చేస్తున్నారు. పాఠాలు బోధించే మాస్టార్లే వీధినపడటంతో.. గిరిజన గురుకుల విద్యాలయాలు, కళాశాలల్లో బోధన కుంటుపడింది. విద్యార్థులు, తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది.

–సీతంపేట/సాలూరు/గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో ఉన్న 17 గిరిజన గురుకులాలు/పాఠశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ బోధన సిబ్బంది తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ కొద్దిరోజులుగా విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్న విషయం విదితమే. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల వద్ద రిలే దీక్షలు చేపడుతూ, రోజుకొక రీతిలో తమ నిరసనను తెలియజేస్తున్నారు. అయినప్పటికీ వీరి మొర వినేవారే కరువయ్యారు. జిల్లాలో 17 గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. మొత్తం సుమారు 7 వేల మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. 200 మంది వరకు అవుట్ సోర్సింగ్ బోధన సిబ్బందే ఉన్నారు. అందరూ సమ్మెలో ఉండటంతో పిల్లల చదువులకు ఆటంకం కలుగుతోంది. ఓవైపు విద్యాసంవత్సరం ముగింపునకు చేరుకుంటోంది. పాఠ్యాంశాలు ఇప్పటికీ పూర్తి కాలేదు. దీంతో ఈ ఏడాది చదువులెలా? అంటూ విద్యార్థులతోపాటు, తల్లిదండ్రులూ ఆందోళన చెందుతున్నారు. ఇదే కొనసాగితే పది, ఇంటర్ ఫలితాలపై ప్రభావం పడనుంది.

## గురుకుల ఉపాధ్యాయులకు షాక్..

● ప్రత్యామ్నాయ బోధనకు ప్రభుత్వం చర్యలు

గిరిజన గురుకుల పాఠశాలలు/కళాశాలల్లో అవుట్‌సోర్సింగ్ విభాగంలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. పది రోజులకుపైగా వీరు చేస్తున్న ఆందోళనను కనీసం మానవతాదృక్పథంతోనైనా పట్టించుకుపోగా.. వారి విధుల్లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న జూనియర్ టీచింగ్ సిబ్బందిని సర్దుబాటు చేస్తూ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకులాలకు 21 మందిని, పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గురుకులాలకు 40 మందిని డిప్యుటేషన్‌పై పంపుతూ గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై గురుకులాల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించకపోగా.. మరింత మొండి వైఖరి అవలంబిస్తోందని వాపోయారు.

**డిమాండ్లు ఇవీ...**

● మెగా డీఎస్సీ నుంచి తమ పోస్టులకు మినహాయింపు ఇవ్వాలి.
● సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి.
● 2022 పీఆర్‌సీ ప్రకారం జీతాలు చెల్లించాలి. రెగ్యులర్ చేయడం లేదా కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్లు (సీఆర్‌టీ)గా మార్పు చేయాలి.


సీతంపేట బాలికల గురుకుల పాఠశాల

సీతంపేట గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో మొత్తం 515 మంది విద్యార్థినులు చదువుతున్నారు. 17 మంది బోధన సిబ్బంది ఉండగా.. ఇందులో ఒక్క ప్రిన్సిపాల్ మాత్రమే రెగ్యులర్. మిగతా 16 మంది అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులే. ఇక్కడ పదో తరగతిలో 79 మంది చదువుతున్నారు. సిబ్బంది అంతా సమ్మెలో ఉండడంతో విద్యార్థుల చదువుకు ఆటంకం ఏర్పడింది.

● మల్లి కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ (బాలురు) కళాశాలలో 11 మంది అధ్యాపకులు పనిచేస్తున్నారు. రెగ్యులర్ స్టాఫ్ కేవలం ఇద్దరు మాత్రమే. వీరు ఒకరు ప్రిన్సిపాల్, మరొకరు వైస్‌ప్రిన్సిపాల్. మిగతా 9 మంది సమ్మెలో ఉన్నారు. మొత్తం 129 మంది విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ గ్రూపులు చదువుతున్నారు. ఇక్కడ కూడా తరగతుల బోధన లేదు. వచ్చేనెల 4వ తేదీ నుంచి యూనిట్ పరీక్షలు జరగనున్నాయి.

### మెగా డీఎస్సీ నుంచి మినహాయించాలి



మెగా డీఎస్సీ నుంచి మినహాయింపు ఇవ్వాలి. ఏళ్ల తరబడి చాలీచాలని జీతాలతో పని చేస్తున్నాం. ఇప్పుడు డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే వీధిన పడతాం. ప్రభుత్వం పునరాలోచించాలి. సమానపనికి సమాన వేతనం చెల్లించి, సీఆర్‌టీలుగా మార్చాలి.

– బిడ్డిక గణేష్, అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు

### బోధించే వారు లేరు..



మల్లి గురుకుల పాఠశాలలో పదిరోజులుగా ఆందోళన చేపడుతున్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి. నా కుమారుడు మల్లి రెసిడెన్షియల్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. తరగతులు సక్రమంగా జరగకపోతే ఎలా చదువుతాడు. ప్రభుత్వం వెంటనే స్పందించి సిబ్బందికి న్యాయం చేసి, ఆందోళన విరమింపజేయాలి.

– సవర చెంచయ్య, విద్యాకమిటీ చైర్మన్

● గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరిలో ఉన్న ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో 3 నుంచి పదో తరగతి వరకు మొత్తం 632 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ రెగ్యులర్ ఉద్యోగిగా ప్రిన్సిపాల్ ఒక్కరే ఉండటం గమనార్హం. 23 మంది అవుట్‌సోర్సింగ్ విభాగంలో ఉండగా.. 18 మంది ప్రస్తుతం సమ్మెలో ఉన్నారు. ఏపీ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో మొత్తం 444 మంది విద్యార్థులుండగా.. ముగ్గురే రెగ్యులర్ సిబ్బంది ఉన్నారు. 17 మంది అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తుండగా.. అందులో ప్రస్తుతం 13 సమ్మె కారణంగా కొద్దిరోజుల నుంచి విధులకు హాజరు కావడం లేదు. గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో మొదటి, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు 277 మంది ఉన్నారు. ఇక్కడ రెగ్యులర్ ప్రాతిపదికన అయిదుగురు పని చేస్తున్నారు. అవుట్‌సోర్సింగ్ విభాగంలో ఉన్న అయిదుగురు కూడా సమ్మెలోనే ఉన్నారు. బాలుర జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల సంఖ్య 239. మొత్తం తొమ్మిది మంది రెగ్యులర్ సిబ్బంది కాగా.. ముగ్గురు అవుట్‌సోర్సింగ్ విధానంలో ఉన్నారు. అందులో సమ్మె ఇద్దరు సమ్మె చేస్తున్నారు.

● మొత్తంగా ఇక్కడున్న పాఠశాలలు/కళాశాలల్లో 1,592 మంది విద్యార్థులకు ప్రస్తుతం పది మంది మాత్రమే బోధనకు ఉన్నారు. రెగ్యులర్ సిబ్బంది 18 మందిలో కొంతమంది ప్రిన్సిపాళ్లు, ఇతర సిబ్బందే.


ఉపాధ్యాయులు లేక తరగతి గదిలో ఖాళీగా కూర్చొన్న భద్రగిరి గురుకుల పాఠశాల విద్యార్థులు

### తరగతులు నష్టపోతున్నారు..



గురుకుల బాలికల కళాశాలలో మా మేనకోడలు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. పలు సబ్జెక్టుల అధ్యాపకులు సమ్మెకు వెళ్లటంతో పూర్తి స్థాయిలో తరగతులు జరగని పరిస్థితి నెలకొంది. పబ్లిక్ పరీక్షలు దగ్గరపడుతున్నాయి. ఈ సమయంలో తరగతుల బోధనలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలి.

– కోలక శ్రీను,పేరెంట్, దండుసూర గ్రామం

పాచిపెంట మండలంలోని పి.కోనవలసలో గిరిజన గురుకుల బాలుర పాఠశాలతోపాటు.. బాలుర, బాలికల కళాశాలలు ఉన్నాయి. బాలుర పాఠశాలలో 504 మంది విద్యార్థులుండగా.. వీరికి మొత్తం పీఈటీతో కలిపి 19 మంది ఉపాధ్యాయులే ఉన్నారు. ఇందులో రెగ్యులర్ ఉపాధ్యాయులు అయిదుగురే. మిగిలిన 14 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కాగా.. ఇక్కడ 13 మంది తమ డిమాండ్ల సాధన కోసం నిరసన బాట పట్టారు. ఇప్పటికే పాఠ్యాంశాలు పూర్తి కాలేదు. ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయులు తొలుత తమ తరగతులను పూర్తి చేసుకున్నాకే.. మిగిలిన తరగతులకు స్టడీ అవర్స్‌తో సరిపెట్టేస్తున్నారు.

☛ బాలుర కళాశాలలో 247 మంది విద్యార్థులున్నారు. వీరికి మొత్తం 12 మంది అధ్యాపకులు ఉండగా.. ఇందులో రెగ్యులర్ ఉద్యోగులు ఏడుగురే. మిగిలిన 5గురు అవుట్‌సోర్సింగ్ వారే. వారు కూడా ధర్నా బాట పట్టారు.

☛ బాలికల కళాశాలలో 272 మంది విద్యార్థినులున్నారు. 11 మంది అధ్యాపకుల్లో రెగ్యులర్ వారు ఎనిమిదిమందే. అవుట్‌సోర్సింగ్‌లో ఉన్న ముగ్గురూ ప్రస్తుతం సమ్మెలో ఉండటంతో విధులకు రావడం లేదు.


పి.కోనవలస గిరిజన గురుకుల బాలుర పాఠశాల

### మా పిల్లల భవిష్యత్‌ను ఆలోచించండి..



కోనవలస పాఠశాలలో అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు వారి సమస్యలపై రిలే దీక్షలు చేస్తున్నట్లు తెలిసింది. వారి డిమాండ్లు న్యాయమైనవే. ఇదే సందర్భంలో మా పిల్లల చదువుపై ఆ ప్రభావం పడుతోంది. పాఠాలు చెప్పేవారు ఎవరూ ఉండటం లేదు. ప్రభుత్వం ఆలోచించి తక్షణమే ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి.

– పి.వెంకటరావు, పి.కోనవలస గురుకుల పాఠశాల విద్యార్థి తండ్రి

### కుమారుడి చదువుపైనే మా ఆశలన్నీ..



పి.కోనవలస పాఠశాలలో మా కుమారుడు పదో తరగతి చదువుతున్నాడు. వాడిపైనే మా ఆశలన్నీ ఉన్నాయి. ఇప్పుడు ఆ పాఠశాలలో అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు ధర్నాకు వెళ్లారు. దీని వల్ల మా పిల్లలు చదువులకు ఇబ్బందులు పడుతున్నారు. దయచేసి ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి. వారి విధులకు ఆటంకం లేకుండా చూడాలి. తద్వారా మా పిల్లలకు మేలు చేయాలని కోరుతున్నాం.

–పైడితల్లి, పి.కోనవలస గురుకుల పాఠశాల విద్యార్థి తండ్రి

## కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్‌గా గుర్తించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ జిల్లా కన్వీనర్ బీవీ రమణ

పార్వతీపురంటౌన్: ఐటీడీఏ పరిధిలోని గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా కన్వీనర్ బీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్వతీపురం ఐటీడీఏ వద్ద నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో గురువారం ఆయన పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా ఐటీడీఏ పరిధిలోని గురుకుల పాఠశాలల్లో అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కనీస వేతనాలు చెల్లించకుండా ఉద్యోగ భద్రత కల్పించకుండా ప్రభుత్వం మోసగించిందని విమర్శించారు. భవిష్యత్తులో తమ ఉద్యోగం రెగ్యులర్ అవుతుందనే ఆశతో పని చేస్తున్న వారి పట్ల ఇంత నిర్లక్ష్యం ప్రదర్శించడం సరైన విధానం కాదన్నారు. వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీలో ప్రస్తుతం వీరు పనిచేస్తున్న స్థానాలను వీరికే రిజర్వ్ చేసి మిగిలిన ఖాళీలను మాత్రమే డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు పాలక రంజిత్ కుమార్, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు యూనియన్ నాయకులు దివాకర్, రమేష్, వెంకట్ పాల్గొన్నారు.

## పరికరాల కోసం ప్రత్యేక శిబిరాలు

● సద్వినియోగం చేసుకోవాలి
● కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, అలిమ్‌కో సంస్థ సౌజన్యంతో పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణలో గురువారం ఏర్పాటు చేసిన శిబిరాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన దివ్యాంగులు, వయోవృద్ధులతో కలెక్టర్ మమేకమయ్యారు. వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. శిబిరంలో ఎంపికైన వారికి పత్రాలను పంపిణీ చేశారు. నెల, రెండు నెలల్లో పరికరాలు వస్తాయని వాటిని అప్పుడు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం దివ్యాంగుల కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తూ వారి వైకల్యాన్ని గుర్తించి వారి రోజువారీ సాధారణ జీవితం సాఫీగా కొనసాగించేందుకు సహాయక సామగ్రిని అందజేస్తోందని చెప్పారు. ఈ మేరకు భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన హైదరాబాద్ ఆధారిత అలిమ్ కో-కంపెనీ సహకారంతో ఈ నెల 26న సాలూరులో, 27న పాలకొండలో గురువారం పార్వతీపురంలో శిబిరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.

శుక్రవారం కురుపాంలో దివ్యాంగ అభ్యర్థులను పరీక్షించి, వారి వైకల్యానికి అవసరయ్యే పరికరానికి ఎంపిక చేసి వారికి ఉచితంగా సరఫరా చేయనున్నామని కలెక్టర్ తెలిపారు. బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్, సాధారణ ట్రైసైకిల్స్, వీల్‌చైర్, చంక కర్రలు, కాలిపర్స్, కృత్రిమ భాగాలు, స్మార్ట్ కేన్, బ్రెయిలీ కిట్, స్మార్ట్ ఫోన్, వినికిడి సాధనాలతో సహా వివిధ పరికరాలు అందించనున్నట్లు వివరించారు.

**గుర్తింపు శిబిరాలకు మంచి స్పందన**

గుర్తింపు శిబిరాలకు లబ్ధిదారుల నుంచి మంచి స్పందన లభించింది. సాలూరులో 82 మంది అభ్యర్థులు ఎంపికవగా వారికి సుమారు రూ.17.18 లక్షల విలువగల పరికరాలు అందనున్నాయన్నారు. పాలకొండలో 75 మంది ఎంపిక కాగా రూ.11.87 లక్షల విలువ గల పరికరాలు అందనున్నాయి. పార్వతీపురంలో నిర్వహించిన శిబిరానికి 250 లబ్ధిదారులు హాజరయ్యారన్నారు.

కురుపాంలో మంచి స్పందన రాగలదని ఆశిస్తున్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె కవిత, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి రమేష్ రామన్, అలిమ్ కో ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట: జనజాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర గిరిజన సంస్కృతి, పరిశోధనా శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో ఈనెల 26,27 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో వివిధ ఆశ్రమపాఠశాలలు, గురుకులాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వారిని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి గురువారం అభినందించారు. ప్రతి రోజు పాఠశాలల్లో క్రీడలు ఆడడం ప్రాక్టీస్ చేయాలన్నారు. క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## క్రీడాస్ఫూర్తితో మెరుగైన సేవలందించాలి

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మూడురోజుల పాటు నిర్వహించనున్న వార్షిక జిల్లా పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్–2024 వేడుకలను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి గురువారం ప్రారంభించారు. జిల్లా పోలీసుశాఖకు చెందిన విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్ డివిజన్, ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగానికి చెందిన నాలుగు జట్లు వివిధ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో పోటీపడి తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించనున్నాయి. ఈ సందర్భంగా విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ పోలీసు ఉద్యోగులు అన్నిరంగాల్లోనూ ఇతరులకు రోల్ మోడల్‌గా ఉండాలని సూచించారు. ఉద్యోగరీత్యా పోలీసులు అనేక ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న కారణంగా శిక్షణలో ఉన్న శారీరక సామర్థ్యాన్ని కొనసాగించడం కష్టంగా మారుతుందన్నారు. కానీ, శారీరక సామర్థ్యంతో పాటు మానసిక ఆనందం కూడా చాలా అవసరమని, వాటిని మెరుగుపర్చుకోవడానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు.

**క్రీడాస్ఫూర్తి అవసరం**

ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు ముఖ్యం కాదని, ఉద్యోగులందరూ ఒక్కటిగా పనిచేయడం, విజయానికి అవసరమైన సహాయ, సహకారాలను ఒకరికొకరు అందించుకునే క్రీడాస్ఫూర్తి ఉద్యోగుల్లో అవసరమన్నారు. శారీరక, మానసిక సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడానికి కనీసం ఏదో ఒక క్రీడలో ప్రతిరోజూ పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో తొలుత పురుషుల 400 మీటర్లు, మహిళల 100 మీటర్ల పరుగు పందెం ప్రారంభించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేశారు. ప్రారంభ వేడుకల్లో వివిధ పోలీసు జట్లు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ ఆహ్వానితులను ఎంతగానో ఆకట్టుకుంది.

## ఆదుకుంటున్న కొడుకు అనంతలోకాలకు..

● ఉపాధి కోసం వెళ్తే ఆగిపోయిన ఊపిరి
● రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
● ఒంటరిగా మిగిలిన తల్లి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చంద్రశేఖర్

వీరఘట్టం: అమ్మా పని ముగించుకుని సాయంత్రం వేగంగా వచ్చేస్తానని చెప్పిన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడనే విషయం తెలియడంతో ఆ తల్లి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది.వీరఘట్టం మండలం జె.గోపాలపురం గ్రామానికి చెందిన ఊయక చంద్రశేఖర్(25) గురువారం శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బచ్చల కురిమినాయుడుతో కలిసి ఆమదాలవలస సమీపంలో జలజీవన్ మిషన్ పనుల్లో బాగంగా పైప్‌లైన్లు వేసే పని కోసం గురువారం తెల్లవారుజామున ఇంటి నుంచి బైక్‌పై చంద్రశేఖర్ బయల్దేరి వెళ్లాడు. కురిమినాయుడు బైక్ నడుపుతుండగా చంద్రశేఖర్ వెనుక కూర్చున్నాడు. ఇంతలో మార్గమధ్యంలో ఆమదాలవలస సమీపంలోని పార్వతీసురిని పేట, సెయింట్ ఆన్స్ స్కూల్ జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న ఆర్‌టీసీ బస్సు ఢీ కొట్టడంతో బైక్‌పై వెళ్తున్న వారిద్దరూ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో బస్సు వెనుక చక్రం చంద్రశేఖర్ తల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే చనిపోయాడు. కురిమినాయుడికి నడుము, మోచేయి, మోకాళ్లపై తీవ్ర గాయాలు కాగా ప్రస్తుతం ఆయన శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. మృతుడు చంద్రశేఖర్ తండ్రి చిన్నతనంలోనే చనిపోయాడు. తల్లి అమరావతి పెంచి పెద్ద చేయగా నేడు ఆ ఇంటికి చంద్రశేఖర్ పెద్దదిక్కుగా ఉన్నాడు.చంద్రశేఖర్ మృతితో ఆ తల్లి దిక్కులేనిదైపోయి రోడ్డున పడింది. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.